www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 5 మార్చి 2023
5
అన్నమయ్య



బాలికల పట్ల ప్రధానోపాధ్యాయుడి అసభ్య ప్రవర్తన


పాఠశాల వద్ద నిరసన తెలుపుతున్న తల్లిదండ్రులు

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

స్థానిక ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు మొగిలీశ్వరయ్య బాలికల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్న విషయమై పిల్లలు తల్లిదండ్రుల దృష్టికి తీసుకెళ్లారు. శనివారం పాఠశాలకు వచ్చి హెచ్‌ఎంను మందలించి, తీరు మార్చుకోవాలని దేహశుద్ధి చేశారు. సమాచారం తెలుసుకున్న ఎంఇఒ త్యాగరాజు, సర్పంచ్ నీలావర్ పాఠశాల వద్దకు చేరుకున్నారు. పిల్లల తల్లిదండ్రులతో విచారించారు. పిల్లల సైతం విచారించి అతనిపై చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో పిల్లల తల్లిదండ్రులు శాంతించారు. విషయాన్ని వెంటనే డిఇఒ రాఘవరెడ్డికి పిల్లల తల్లిదండ్రుల ఫిర్యాదును ఎంఇఒ త్యాగరాజు వివరించారు. స్పందించిన డిఇఒ రాఘవరెడ్డి వెంటనే అతనిపై చర్యల్లో భాగంగా సస్పెండ్ చేశారు.

9 నుంచి ఏప్రిల్ 3 వరకు ఉద్యమాలు


మాట్లాడుతున్న బొప్పరాజు వెంకటేశ్వర్లు

- హక్కులు, హామీల అమలు కోసమే..
- ప్రభుత్వం లిఖితపూర్వక హామీ ఇవ్వాలి
- ఎపిజెఎసి అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-కడప అర్బన్

ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్స్, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల హక్కులు, హామీల అమలు కోసం ఈ నెల 9వ తేదీ నుంచి ఏప్రిల్ 3 వరకు ఉద్యమాలు పడుతున్నట్లు ఎపిజెఎసి అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు అన్నారు. ఉద్యమ ముందడుగులో భాగంగా శనివారం కడప నగరంలోని వైఎస్ఆర్ ఆడిటోరియంలో జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉద్యమ కార్యాచరణలో భాగంగా ఈ నెల 9, 10వ తేదీలలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలియజేస్తామని పేర్కొన్నారు. 13, 14వ తేదీలలో కలెక్టరేట్ల ఎదుట భోజన విరామ సమయంలో ఆందోళన నిర్వహిస్తామని చెప్పారు. 15, 17, 20వ తేదీలలో కలెక్టరేట్ ఎదుట ధర్నాలు ఉంటాయని పేర్కొన్నారు. 21వ తేదీ సెల్ డౌన్ పేరుతో ప్రభుత్వ యాప్‌లను పనిచేయకుండా నిలిపివేస్తామని చెప్పారు. 27న విజయవాడలోని ప్రధాన కార్యాలయం ఎదుట ధర్నా ఉంటుందని తెలిపారు. ఏప్రిల్ ఒకటవ తేదీన ఓదార్పుయాత్ర పేరుతో ఉద్యోగుల, ఉద్యోగం చేస్తూ మరణించిన కుటుంబాల, సిపిఎస్ ఉద్యోగుల సమస్యలు, కష్టాలు ఇళ్ల వద్దకు వెళ్లి తెలుసుకుంటామని పేర్కొన్నారు. మూడవ తేదీ కలెక్టరేట్లలో నిర్వహించే స్పందనలు వినతిపత్రం అందజేస్తామని చెప్పారు. అప్పటికి ప్రభుత్వం, అధికారులు దిగిరాకపోతే 5వ తేదీ 94 సంఘాల ప్రతినిధులతో సమావేశమై భవిష్యత్తు కార్యాచరణ రూపొందిస్తామని హెచ్చరించారు. మలిదశ ఉద్యమాన్ని ప్రారంభిస్తామని తెలిపారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని మాత్రమే తాము కోరుతున్నామని పేర్కొన్నారు. ఎక్కడా గొంతెమ్మ కోరికలు కోరడం లేదని స్పష్టం చేశారు. ఉద్యమాన్ని ఎవరో నడిపిస్తున్నారని ప్రభుత్వం, అధికారులు భావించాల్సిన అవసరం లేదన్నారు. వైసిపి ప్రభుత్వ హయాంలో ఉద్యోగులకు ఎలాంటి ప్రయోజనాలు లేవని, చివరికి ఆరోగ్య సమస్యలు తీర్చుకునేందుకు కూడా హెల్త్ కార్డులు పనిచేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ ఉద్యమం ప్రభుత్వంపై కాదని తమ హక్కులు, హామీల అమలు కోసమేనని స్పష్టం చేశారు. హెల్త్ కార్డులకు సంబంధించి ఏడాదికి రూ.250 కోట్లు ఉద్యోగులు ప్రభుత్వానికి వైద్య ఖర్చుల నిమిత్తం చెల్లిస్తున్నారని గుర్తుచేశారు. కార్పొరేట్ ఆసుపత్రిలో వారికి లాభం ఉండే చిన్న చిన్న వైద్య సేవలు అందిస్తూ చేతులు దులుపుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని విమర్శించారు. కారుణ్య నియామకాలు చేపట్టకపోవడం బాధాకరమన్నారు. కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామన్న హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. కరోనా సమయంలో ప్రజల కోసం విధులు నిర్వహించి ఎంతో మంది ఉద్యోగులు ప్రాణాలను విడిచారని ఆవేదన వ్యక్తం చేశారు. వీరి కుటుంబాలను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఒకటవ తేదీ జీతాలు ఇచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం లిఖితపూర్వక హామీ ఇచ్చే వరకూ ఉద్యమాన్ని కొనసాగిస్తామని హెచ్చరించారు. సమావేశంలో రాష్ట్ర సెక్రటరీ జనరల్ పలిశెట్టి దామోదర్‌రావు, రాష్ట్ర నాయకులు సాంబశివరావు, మల్లేశ్వరరావు, వైయస్సార్ జిల్లా చైర్మన్ జీవన్‌చంద్రశేఖర్, జనరల్ సెక్రటరీ కృష్ణకుమార్, ఉపాధ్యక్షులు పురుషోత్తం, కోశాధికారి రోనాల్డ్ శామ్యూల్ రాజ్, సెక్రటరీ అలీఖాన్, ఎపిపిటిడి డిప్యూటీ జనరల్ సెక్రటరీ నరసయ్య, జోనల్ సెక్రటరీ రాజశేఖర్, ఆర్టీసీ రీజినల్ సెక్రటరీ రామమూర్తి, అన్ని సంఘాల ఉద్యోగులు పాల్గొన్నారు.

నేడు పీలేరుకు లోకేష్ పాదయాత్ర

- బహిరంగ సభకు సన్నాహాలు
- నియోజకవర్గంలో నాలుగు రోజులు యాత్ర

ప్రజాశక్తి-పీలేరు

తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర ఆదివారం పీలేరు చేరుకోనుంది. తమ యువ నేతకు స్వాగతం పలకడానికి టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు భారీ ఏర్పాట్లు చేపట్టారు. ఆదివారం సాయంత్రం పీలేరులో నారా లోకేష్ బహిరంగ సభకు భారీ స్థాయిలో జన సమీకరణ చేపట్టి సభను నిర్వహించడానికి అవసరమైన ఏర్పాట్లల్లో టిడిపి కుటుంబ సభ్యులు సన్నద్ధమయ్యారు. అనంతరం ఆయన పాదయాత్ర పీలేరు మండలం, వేపులబైలు వరకు సాగనుంది. రాత్రికి ఆయన అక్కడే బస చేయడానికి వీలుగా సన్నాహాలు చేస్తున్నారు. పీలేరు నియోజకవర్గంలో నాలుగు రోజుల పాటు లోకేష్ పర్యటన సాగనుంది. 49.4 కిలోమీటర్ల మేర పాదయాత్ర సాగనుంది.

నేటి పాదయాత్ర వివరాలు

పులిచెర్ల మండలం జ్యోతిరావ్ విడిది కేంద్రం నుంచి పాదయాత్ర ప్రారంభమవుతుంది. ఎమ్మెల్యే కాలేజీ అగ్రహారం క్రాస్ వద్ద స్థానికులతో మాటామంతి. పీలేరు భాస్కర్ ఐటిఐ కళాశాల వద్ద నియోజకవర్గంలో ప్రవేశం. అక్కడే భోజన విరామం. అనంతరం సాయంత్రం పాదయాత్ర కొనసాగింపు. పీలేరులో బహిరంగసభ ఉంటుంది. జంక్షన్ వద్ద స్థానికులతో మాటామంతి. ఆర్టీసి బస్టాండు వద్ద స్థానికులతో భేటీ. అంబేద్కర్ విగ్రహం వద్ద ముస్లింలతో మాటామంతి. పీలేరు శివారు విడిది కేంద్రంలో బస.


పీలేరులో లోకేష్ సభకు సాగుతున్న ఏర్పాట్లు

పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించండి

ప్రజాశక్తి - బద్వేలు

స్థానిక సుమిత్రానగర్, మెహబూబ్‌నగర్ వీధుల్లో శనివారం పిడిఎఫ్ బలపరుస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థులు కత్తి నరసింహారెడ్డి, పోతుల నాగరాజును గెలిపించాలని ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆవాజ్ కమిటీ జిల్లా అధ్యక్షులు చాంద్‌బాషా మాట్లాడుతూ రాష్ట్రంలో నిరుద్యోగం రోజురోజుకూ పెరిగిపోతుందని, పాలకులు చూసి చూడనట్టు వ్యవహరిస్తూ, నిరుద్యోగ యువతను తీరని ద్రోహం చేస్తున్నారని చెప్పారు. రాజకీయ విలువలతో పిడిఎఫ్ బలపరిచిన పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజుని, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కత్తి నరసింహారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించి శాసనమండలికి పంపించాలని కోరారు. కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా నాయకులు గిలక రాజు ,ఆటో యూనియన్ కార్యదర్శి రమణయ్య ,డివైఎఫ్ఐ కార్యదర్శి పుల్లయ్య , ఆవాజ్ కమిటీ జిల్లా ఉపాధ్యక్షులు అన్వర్ భాష ,మస్తాన్ , చేతి వృత్తిదారుల సంఘం నాయకులు మునయ్య , గంగయ్య పాల్గొన్నారు. పట్టణంలో అశోక్ నగర్, దూదేకుల వీధి పలు సచివాలయంలో డివైఎఫ్ఐ, సిఐటియు, వృత్తిదారుల సంఘం, మహిళా సంఘం, ఐద్వా సంఘాల ఆధ్వర్యంలో ఇంటింటికీ తిరిగి విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో వృత్తిదారుల సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు పొంగూరు నాగరాజు, డివైఎఫ్ఐ జిల్లా నాయకులు ఎస్ ప్రవీణ్ కుమార్, రమణారెడ్డి మల్లికార్జున, వెంకటరామయ్య సిఐటియు నాయకులు కొండయ్య, నరసింహ, రాజగోపాల్, గంప సుబ్బరాయుడు, ఐద్వా నాయకులు రత్నమ్మ, అనంతమ్మ, బాలమ్మ, మోక్షమ్మ, మస్తాన్‌బి పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : శాసన మం డలిలో ప్రజా సమస్యలపై మాట్లాడాలంటే, పిడిఎఫ్ ఎమ్మెల్సీలు ఉండాలని ప్రజా పక్షం నిలబడే అభ్యర్థులనే శాసన మండలికి పంపాలని, పశ్చిమ రాయల సీమ అభ్యర్థి పోతుల నాగరాజుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు డేవిడ్‌రాజ్ పేర్కొన్నారు. విజ్ఞానవంతులు, మేధావులు ఉండే సభలో రాజకీయాల కతీతంగా పనిచేసే పిడిఎఫ్ అభ్యర్థులు కత్తి నరసింహారెడ్డి, పోతుల నాగరాజును గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు మున్నా వర్ధను సునీల్ అనీలు పాల్గొన్నారు. **జమ్మలమడుగు రూరల్ :** ప్రజా సమస్యల పరిరక్షణే ధ్యేయంగా నిరంతరం పోరాడుతున్న ఉద్యమ అభ్యర్థులనే చట్ట సభలకు పంపుదామని సిఐటియు ఏరియా ఉపాధ్యక్షులు వీరనాల శివ నారాయణ, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి వినయ్‌కుమార్ తెలిపారు. పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ పట్టణంలో ప్రజాసంఘాల అధ్వర్యంలో పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులను, బ్యాంకు, సచివాలయం ఉద్యోగులను, బ్యాంకు ఉద్యో గులను కలిసి ఓటు ను అభ్యర్థించారు. కార్యక్రమంలో నాయ కులు ముని, ప్రసాద్, మధు, ఆచారి పాల్గొన్నారు. **ఎర్రగుంట్ల :** ఈనెల 13న నిర్వహించబోయే పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర విజ్ఞప్తి చేశారు. ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఐ జమ్మలమడుగు నియోజకవర్గ కార్యదర్శి ఎం.వి సుబ్బారెడ్డి, సిపిఐ మండల కార్యదర్శి భవాని శంకర్, ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు చాంద్ బాషా, ఎఐఎస్ఎఫ్ నాయకులు శరత్, లీలా కృష్ణ పాల్గొన్నారు

ప్రభుత్వ భూమిని పరిశీలించిన కలెక్టర్

ప్రజాశక్తి-రామాపురం

వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి ప్రభుత్వ భూమిని కలెక్టర్ గిరిష పిఎస్ పరిశీలించారు. మండలంలోని కుమ్మరపల్లె పంచాయతీ కాకులారం గ్రామంలో సర్వే నంబర్ 28/2 లో 96.8 ఎకరాలు, బండపల్లిలో సర్వే నెంబర్ 324లో108.15 ఎకరాల ప్రభుత్వ భూమిని కలెక్టర్ శనివారం ఉదయం పరిశీలించారు. రాయచోటి నియోజకవర్గంలో ఏపీఐఐసీ(ఆంధ్ర ప్రదేశ్ ఇండస్ట్రియల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్) ద్వారా వివిధ పరిశ్రమలు స్థాపించి ఈ ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని చెప్పారు. ఇందుకు సంబంధించి రాయచోటి నియోజకవర్గంలో 500 నుంచి1000 ఎకరాల ప్రభుత్వ భూమి గుర్తించాలని కలెక్టర్ నియోజ కవర్గంలోని తహశీల్దార్లకు సూచించారు. కార్యక్రమంలో రాయచోటి ఆర్డీవో రంగస్వామి, రామాపురం తహశీల్దార్ సత్యానందం, ఆర్ఐ రవికుమార్, సర్వేయర్ ప్రియాంక పాల్గొన్నారు


ప్రభుత్వ భూమిని పరిశీలిస్తున్న కలెక్టర్ గిరీష


కూలిపోయే స్థితిలో ఉన్న వాణిజ్య భవనం

కూలేందుకు సిద్ధంగా పాత వాణిజ్య భవనం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

పట్టణంలోని ఆర్.ఎస్.రోడ్డులోని ఓ ప్రయివేటు ఆస్పత్రి సందులో ఉన్న పాత వాణిజ్య భవనవం కూలేందుకు సిద్ధంగా ఉంది. ఆ భవనాన్ని కొంత తొలగించి అలాగే వదిలేశారు. పూర్తిగా తొలగించకపోవడంతో ఎప్పుడు కూలిపోతుందనే ఆందోళనలో ప్రజలు భయం భయంగా గడుపుతున్నారు. భవనం పూర్తిగా నెర్రెలు చీలి కూలిపోయే స్థితిలో ఉంది. ఈ మార్గం ద్వారా నిత్యం ప్రముఖ విద్యా సంస్థలకు చెందిన పాఠశాలకు విద్యార్థులు, వారి తల్లితండ్రులు సంచరిస్తూ ఉంటారు. రోగులు కూడా వివిధ ప్రాంతాల నుంచి పట్టణానికి వచ్చిన వారు ఎక్కువగా ఈ చుట్టు ప్రక్కల ఉన్న ఆసుపత్రులకు వచ్చి పోతూ ఉంటారు. ఏ క్షణంలోనైనా కూలిపోయే స్థితిలో ఉన్న భవనం పొరపాటున కూలితే పెద్ద ప్రమాదమే జరిగే అవకాశం లేకపోలేదు. మున్సిపల్ అధికారులు రాబోవు ప్రమాదాన్ని ముందుగా గుర్తించి ప్రాణహాని జరగకుండా చూడాలని ప్రజలు కోరుకుంటున్నారు.

రేపటి 'స్పందన' తాత్కాలికంగా రద్దు

ప్రజాశక్తి-రాయచోటి

స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించే ప్రజాఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమం 'స్పందన'ను తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ గిరీష శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉపాధ్యాయులు, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో భాగంగా జిల్లా అధికారులందరూ ఆయా విధులలో పాల్గొనాల్సి ఉన్నందున స్పందన కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేశామన్నారు. ఈ విషయాన్ని ప్రజలందరూ గమనించి అనవసర వ్యయ ప్రయాసల కోర్చి సోమవారం జిల్లా ప్రధాన కేంద్రం రాయచోటికి స్పందనలో ఫిర్యాదులు అందజేయడానికి రావద్దని పేర్కొన్నారు.

జిల్లా ప్రకటనను స్వాగతిస్తున్నాం : జెఎసి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే మదనపల్లెను జిల్లా చేస్తామని నారా లోకేష్ ప్రకటించడం హర్షనీయమని ఈ ప్రకటనను స్వాగతిస్తున్నామని మదనపల్లె జిల్లా సాధన జెఎసి నాయకులు తెలిపారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి రమేష్, జనసేన రాయలసీమ కో-కన్వీనర్ గంగారపు రామదాస్ చౌదరి, బిఎస్‌పి రాష్ట్ర ఉపాధ్యక్షులు బందెల గౌతం కుమార్, మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షులు యమాల సందర్శనం, సిపిఐ కృష్ణప్ప, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఒబిసి జాయింట్ కో-ఆర్డినేటర్ నాగూర్ వల్లి, టిడిపి నాయకులు భవానీ ప్రసాద్ మాట్లాడుతూ మదనపల్లె జిల్లా కోసం సాధన చేసిన పోరుబాట ఆదర్శనీయంగా నిలిచిపోయిందని తెలిపారు. జిల్లా కోసం చేపట్టిన ఉద్యమాన్ని ప్రభుత్వం అణిచివేయడానికి ఎన్ని ప్రయత్నాలు చేసిన బెదరలేదన్నారు. మదనపల్లెను జిల్లా చేయకుండా వైసిపి చరిత్రలో దోషిగా మిగిలిపోయిందని పేర్కొన్నారు.

అన్నదానం గొప్పది

ప్రజాశక్తి - రాయచోటి

అన్ని దానాల కన్నా అన్నదానం గొప్పదని టిడిపి నియోజకవర్గ నాయకులు సుగవాసి ప్రసాద్ బాబు పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని పాత రాయచోటిలో శ్రీదండువారమ్మ తల్లి జాతర మహోత్సవ కార్యక్రమానికి ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వానం మేరకు ఆయన శ్రీదండువారమ్మకు ప్రత్యేక పూజలుచేసి అన్నదానం కార్యక్రమం ప్రారంభించారు. కార్యక్రమంలో మండ్ల సతీష్, ఉమ్మరశెట్టి సుబ్బరాయుడు, ఉమ్మరశెట్టి లక్ష్మీనారాయణ, వార్డెన్ నాగేశ్వరావు, రంగయ్య గువ్వల,చరణ్ గువ్వల, నాగేంద్ర, సుబ్బారాయుడు, సతీష్, మహేష్, నరేష్, మధు, మల్లికార్జున, సాయిప్రతాప్, కటారు శివ,మస్తాన్, జనార్ధన్, రామంజులునాయుడు, బడిశెట్టి రవి, మన్నేరు రామాంజనేయులు పాల్గొన్నారు.

యువగళం పాదయాత్రలో 'మండిపల్లి'

ప్రజాశక్తి-రాయచోటి

తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రలో పుంగనూరు వద్ద శనివారం రాయచోటి టిడిపి నియోజకవర్గ నాయకుడు రాంప్రసాద్‌రెడ్డి టిడిపి కార్యకర్తలు, తన అనుచరులతో కలిసి పాల్గొన నడిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోకేష్ చేపట్టిన పాదయాత్రలో ప్రజలు ఆయనకు అడుగడుగునా నీరాజనాలు పడుతూ విశేష స్పందన లభిస్తుందన్నారు. ఇది చూసి ఓర్వలేని ప్రభుత్వం పాదయాత్రలకు అడ్డంకులు సృష్టించడానికి ప్రయత్నిస్తున్నారు. కార్యకర్తలు, ప్రజలు అండదండలతో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పాదయాత్ర ముందుకు కొనసాగిస్తూ ప్రభుత్వం చేసే అరాచకాలను ఎండగడుతూ రాబోయే కాలంలో టిడిపి జెండాను ఏగరవేస్తామని పేర్కొన్నారు. **రాజంపేట అర్బన్ :** టిడిపి రాజంపేట పార్లమెంట్ అభ్యర్థి గంటా నరహరి యువగళం పాదయాత్రలో లోకేష్‌తో కలిసి నడిచారు.

యూత్ పార్లమెంట్ ఫెస్టివల్‌లో 'జ్ఞానాంబికా' విద్యార్థి

ప్రజాశక్తి- మదనపల్లె అర్బన్


విద్యార్థి సోఫియాను అభినందిస్తున్న కరస్పాండెంట్ గురుప్రసాద్

కేంద్ర యువజన, క్రీడా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన యూత్ పార్లమెంట్-2023 ఫెస్టివల్‌లో పట్టణంలోని జ్ఞానాంబికా కళాశాలకు చెందిన విద్యార్థిని పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా 87 మంది విద్యార్థులు యూత్ పార్లమెంట్ ఫెస్టివల్‌లో పాల్గొనగా అందులో రాష్ట్రం తరఫున కళాశాలకు చెందిన బికాం ఫైనల్ ఇయర్ విద్యార్థిని సోఫియా మెహజబిన్ పాల్గొన్నారు. యూత్ పార్లమెంట్ ఫెస్టివల్లో పాల్గొనేందుకు కేంద్ర ప్రభుత్వం పిలుపునకు జిల్లా స్థాయిలో వర్చువల్‌గా నిర్వహించిన కార్యక్రమంలో సోఫియా ఎంపికైంది. ఇక్కడ నుంచి రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన వర్చువల్ సెమినార్లో కూడా ఎంపికైంది. ఈ క్రమంలో మార్చి ఒకటి, రెండవ తేదీలో న్యూఢిల్లీలోని పార్లమెంట్ సెంట్రల్ హాల్లో స్పీకర్ ఓంప్రకాష్ బిర్లా అధ్యక్షతన నిర్వహించిన యూత్ పార్లమెంట్‌లో సోఫియా పాల్గొనింది. అక్కడ నిర్వహించిన పలు అంశాలపై పాల్గొనింది. స్వయంగా ఎంపీలు కూర్చునే చోట కూర్చున్న సోఫియా తన అనుభూతిని పంచుకుంది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భవిష్యత్తులో యువత ఎలా ఉండాలి, దేశం కోసం ఇలా పాటుపడాలి, దీనికి యువత పోషించాల్సిన ప్రధాన భూమిక గురించి అవగాహన పెంచుకున్నామన్నారు. తనకి గొప్ప అవకాశం కల్పించిన కరస్పాండెంట్ ఆర్.గురు ప్రసాద్, ప్రిన్సిపల్ ఎస్.రమాదేవి, వైస్ ప్రిన్సిపల్ రాఘవేంద్రలకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజలకు మేమున్నామనే భరోసా కల్పించాలి : డిఎస్‌పి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పోలీసు సిబ్బంది నిరంతరం ప్రజలతో ఉండి వారికి ఏ చిన్న సమస్య వచ్చినా మేమున్నామనే భరోసా కల్పించాలని డిఎస్‌పి కేశప్ప పేర్కొన్నారు. ఎస్‌పి వి.హర్షవర్ధన్‌రాజు ఆదేశాల మేరకు మదనపల్లి పట్టణానికి ట్రాఫిక్, శాంతిభద్రతల పరిరక్షణకుగాను 8 బ్లూకోల్ట్ వాహనాలను టూటౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆయన జెండా ఊపి ప్రారంభించారు. బ్లూకోల్ట్ సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, ఏవైనా శాంతి భద్రతలకు సంబంధించిన విషయాన్ని ముందుగానే సేకరించి అధికారులకు తెలియజేయాలని తెలిపారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణలో ప్రముఖ పాత్ర వహించాలని రాత్రిపూట ఎలాంటి నేరాలు జరగకుండా గస్తీ ముమ్మరం చేయాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో మదనపల్లి టూ టౌన్ సిఐ ఎస్.మురళీకృష్ణ, ట్రాఫిక్ ఎస్ఐ రామాంజనేయులు, ఎఎస్ఐలు జి.చంద్రమోహన్, హరిహర ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా మహిళా దినోత్సవ వారోత్సవాలు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ఈ నెల 8వ తేదీన మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలో శనివారం నుంచి వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. మండల పరిధిలోని ఊటుకూరు సచివాలయంలో పంచాయతీ కార్యదర్శి బాలకుమార్ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు అధ్యక్షత వహించిన రాజంపేట జూనియర్ సివిల్ జడ్జి ఎం.సంధ్యారాణి మహిళలను ఉద్దేశించి మాట్లాడుతూ పోస్కో, భరణం, విడాకులు, గృహహింస, వరకట్న వేధింపులు వంటి మహిళలకు సంబంధించిన అనేక చట్టాల గురించి వివరించారు. మహిళలకు పురుషులతో సమానంగా తల్లిదండ్రుల ఆస్తిపైన హక్కు ఉంటుందని తెలియజేశారు. కార్యక్రమంలో మహిళలు, సచివాలయ సిబ్బంది, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు. **ఎంపిడిఒ కార్యాలయంలో..** మూడవ అదనపు జిల్లా జడ్జి ఆర్.వి.వి.ఎస్ మురళీకృష్ణ ఆదేశాల మేరకు ఎంపిడిఒ కార్యాలయంలోని సభా భవనంలో మహిళలకు న్యాయ విజ్ఞాన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సదస్సులో న్యాయవాదులు శ్రీనివాసులు, నాగేశ్వరరావు పాల్గొని మహిళలకు సంబంధించిన అనేక చట్టాల గురించి తెలియజేశారు. కార్యక్రమంలో డ్వాక్రా మహిళలు, యానిమేటర్లు పాల్గొన్నారు.

శిశు సంరక్షణ తల్లి బాధ్యత : డిపిఎంఒ

ప్రజాశక్తి-పీలేరు

శిశు సంరక్షణ తల్లి బాధ్యతని, బాల్యం ఆరోగ్యంగా గడపాలంటే బిడ్డ అనారోగ్య లక్షణాలు వెంటనే గుర్తించే నైపుణ్యం ప్రతి తల్లికీ అవసరమని అన్నమయ్య జిల్లా డిపిఎమ్ఓ (జిల్లా జాతీయ ఆరోగ్య మిషన్ పర్యవేక్షణ అధికారి) డాక్టర్ లోకవర్ధన్ తెలిపారు. శనివారం పిలేరు మండలంలోని, రేగళ్లు, తలపులు పి.హెచ్.సిల పరిధిలోని పి.ఆర్.సి. కాలనీ, బలిజ వీధి, బండ్ల వంక సచివాలయం, కొత్తపల్లి అంగన్వాడీ కేంద్రాలలో నిర్వహిస్తున్న వ్యాధినిరోధక టీకాల కార్యక్రమాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ పిల్లల ఆనారోగ్య లక్షణాలపై తల్లి తరచూ ప్రత్యేక నిఘా ఉంచాలని, ప్రస్తుత పరిస్థితుల్లో జ్వరం, జలుబు, నీరసం, శ్వాస సమస్య, వాంతి చేసుకోవడం, అసాధారణ విరేచనాలు, తల్లిపాలు, అదనపు ఆహారం తీసుకోవాలనే ధ్యాస లేకపోవడం, శరీరంపై ర్యాష్ మొదలగు అసాధారణమైన లక్షణాలు గమనిస్తుండాలని, ఏదైనా చిన్నపాటి అనారోగ్య లక్షణాలు ఉన్నప్పుడు దగ్గర్లోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచిత చికిత్స, సూచనలు, సలహాలు పొందాలని అన్నారు. ఈ విషయంలో సమీప ఆశ కార్యకర్తల సహకారం తీసుకోవాలని చెప్పారు. అర్ధగంటలోపు ముర్రుపాలు పట్టడం, ఆరు నెలల వరకు కేవలం తల్లిపాలు మాత్రమే ఇవ్వడం, ఆరు నెలల తర్వాత తల్లిపాలతో పాటు అదనపు ఆహారం ఇవ్వడం అలవాటు చేయాలన్నారు. ఒక్కో టీకాకు నెల వ్యవధిలో పూర్తి టీకాలు ఇప్పించడం మొదలగు అంశాలపై తల్లు అవగాహన కలిగి ఉండాలని అన్నారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్ రఫీ, ఆరోగ్య పర్యవేక్షకులు కుసుమ, విజయలక్ష్మి, ఎమ్.ఎల్.హెచ్.పి. సుజాత, అమ్మాజీ, ఏఎన్ఎమ్ భార్గవి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

296 పరుగులకు టీమ్-ఎ ఆలౌట్

ప్రజాశక్తి - కడప

జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కెఎస్ఆర్ఎం మైదానంలో అండర్ -16, 19 ఏజ్ గ్రూపు విభాగాలలో శనివారం నిర్వహించిన లీగ్ మ్యాచ్ లో టీం-ఏ జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 65.5 ఓవర్లలో 296 పరుగులకు ఆలౌట్ అయింది. ఆ జట్టులోని హరి అద్భుతంగా బ్యాటింగ్ ప్రదర్శించి సెంచరీ(101 పరుగులు) చేశాడు. గురు 92 పరుగులు చేశాడు. టీం-బి జట్టులోని జట్టులోని ప్రశాంత్ మూడు వికెట్లు తీసుకున్నారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన టీం -బి జట్టు మొదటి రోజు ఆట ముగిసే సమయానికి మొదటి ఇన్నింగ్స్‌లో 20 ఓవర్లలో నష్టానికి 87 పరుగులు చేసింది.

అండర్ -12, 14 ఏజ్ గ్రూపు విభాగంలో కెఒఆర్ఎఉం క్రికెట్ మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన టీం- ఏ జట్టు 60 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 182 పరుగులు చేసింది. ఆ జట్టులోని సూర్య తేజ 53 (నాట్ అవుట్), ఫైజా 52 (నాటౌట్) పరుగులు చేశారు. టీం- బి జట్టులోని లక్షిత్ 2 వికెట్లు తీసుకున్నాడు. అనంతరం బ్యాటింగుకు దిగిన టీం -బి జట్టు మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 48.5 ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 191 పరుగులు చేసింది. ఆ చెట్టులోని ప్రశాంత్ 52, సాయి కృష్ణ చైతన్య 47 పరుగులు చేశారు. టీం-ఏ జట్టులోని కుషల్ చంద్ రెండు వికెట్లు తీసుకున్నాడు.

లీగ్ మ్యాచ్లను జిల్లా క్రికెటర్ అసోసియేషన్ కార్యదర్శి ఏ. రెడ్డి ప్రసాద్, సంయుక్త కార్యదర్శి ఎం. సాయి పృథ్వి తేజ్, సభ్యులు విష్ణు మోహన్ రావు, సిరాజుద్దీన్ దౌలా, పైడికల్వ విజయ్ కుమార్ ప్రారంభించారు.

రసవత్తరం!

ప్రజా'దృష్టి'

జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికల రాజకీయం రసవత్తరంగా మారింది. ఇటీవల స్థానిక సంస్థల ఎమ్మెల్సీ పదవిని అధికార వైసిపి తన్నుకు పోయిన సంగతి తెలిసిందే. పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోటీపై అందరిదృష్టి నిలిచింది. పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల బరిలో 39 మంది, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బరిలో 12 మంది మధ్య పోటీ నెలకొంది. వీరిలో అధికార, ప్రతిపక్ష పార్టీల మద్దతు కలిగిన అభ్యర్థులను గత ఎన్నికల తరహాలోనే పిడిఎఫ్ అభ్యర్థులు సవాల్ చేస్తున్న సంగతి తెలిసిందే. పిడిఎఫ్ పట్టభద్ర, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థులు వారి వ్యూహాలకు అనుగుణంగా అధికార, ప్రతి పక్ష పార్టీల అభ్యర్థులకు ధీటుగా ఎన్నికల ప్రచారం సాగిస్తుండడంతో వ్యవహారం పోటాపోటీగా మారింది. పిడిఎఫ్ తరుపున బరిలో నిలిచిన పట్టబద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజుకు దన్నుగా ప్రజాసంఘాలు నిలవడంతో ప్రచారం ఉధృతంగా సాగుతోంది. వైసిపి, టిడిపి తరుపున బరిలో నిలిచిన ఎమ్మెల్సీ అభ్యర్థులు వెన్నపూస రవీంద్రారెడ్డి, రామగోపాల్‌రెడ్డి, స్వతంత్ర అభ్యర్థి పట్టుపోగుల పవన్ కరపత్రాల పంపిణీ మొదలుకుని, పోస్టల ద్వారా కరపత్రాల పంపిణీ వరకు ఎవరి వ్యూహాలకు అనుగుణంగా ప్రచారయుద్ధం పతాక స్థాయికి చేరుకుంటోంది. ఉమ్మడి కడప, కర్నూలు, అనంతపురం జిల్లాల్లోని 3,51,700 మంది ఓటర్లలో అత్యధికులను కలిసే విధంగా ఎన్నికల ప్రచారం సాగుతోంది. అధికార, ప్రతి పక్షాల మద్దతుతో బరిలోకి దిగిన అభ్యర్థులు పార్టీ కేడర్ సహకారంతో ముందుకు సాగుతుండడం గమనార్హం. అధికార వైసిపి వాలంటీర్లు దగ్గర నుంచి పార్టీ కేడర్‌తో సమావేశాలును నిర్వహిస్తూ ఓటింగ్ పోలరైజేషన్‌పై దృష్టి సారించింది. టిడిపి సైతం ఎమ్మెల్స ఎన్నికలకు పరిశీలకులను నియమించి ఎన్నికల ప్రచారాన్ని హీటెక్కించింది. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బరిలో నిలిచిన 12 మంది అభ్యర్థుల్లో పిడిఎఫ్ తరుపున బరిలో నిలిచిన కత్తి నరసింహారెడ్డి ఎన్నికల ప్రచారంలో దూసుకెళ్తున్నారు. వైసిపి తరుపున బరిలో నిలిచిన ఎమ్మెల్సీ అభ్యర్థి రామచంద్రారెడ్డి ప్రయివేటు స్కూళ్ల యాజమాన్యాల అండతోపాటు వైసిపి కేడర్‌ను కలుపుకుని ఉధృతంగా ప్రచారం సాగిస్తున్నారు. గతంలో అధికార వైసిపి అభ్యర్థి బాక్సుల ప్రలోభాలకు తెరలేపిన సంగతి తెలిసిందే. పోలింగ్ సమయం దగ్గరపడే కొద్దీ మరోసారి ప్రలోభాలకు గురి చేసేందుకు అవకాశాలు ఉన్నాయనే వాదన వినిపిస్తోంది. అధికార వైసిపికి ఎమ్మెల్సీ ఎన్నికలు సెమీఫైనల్‌గా భావిస్తున్నట్లుగా మారినట్లు కనిపిస్తోంది. పట్టభద్ర, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలువాలనే ఉద్దేశంతో రకాల వ్యూహాలను అధికార పార్టీ పన్నుతోంది. పట్టభద్రులు, ఉపాధ్యాయ ఓటర్లు వివేకాన్ని ప్రదర్శించే అవకాశాలు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రభుత్వ పనితీరును గణనీయంగా సవాల్ చేసే అవకాశాలు ఉన్నాయని మాత్రం గట్టిగా చెప్పవచ్చు.

- ప్రజాశక్తి - కడప ప్రతినిధి



ఇంటి నిర్మాణాలను పరిశీలిస్తున్న స్పెషల్ ఆఫీసర్ లక్ష్మీపతి

లబ్ధిదారులకు ఇబ్బంది లేకుండా చూడండి

ప్రజాశక్తి-బి.కొత్తకోట

నవరత్నాలు పేదలందరికీ ఇళ్ల పథకంలో భాగంగా ప్లాట్లు కేటాయించిన లబ్ధిదారులకు ఇబ్బంది లేకుండా చూడాలని మదనపల్లె డివిజన్ స్పెషల్ ఆఫీసర్ లక్ష్మీపతి ఆదేశించారు. శనివారం పట్టణంలోని కురవోని కుంటస్థలాన్ని జగనన్న కాలనీలో జరుగుతున్న పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా పేదలకు సొంతింటి కలను సాకారం చేసే ఉద్దేశంతో ప్లాట్లు కేటాయించి ఇల్లు నిర్మించి ఇస్తోందన్నారు. కొంత మంది లబ్దిదారులు కాలనీలో దారి సమస్య ఉందని స్పెషల్ ఆఫీసర్ దృష్టికి తీసుకపోయారు. వెంటనే ఆయన స్పందించి కాలవపై కల్వర్టుల నిర్మించి దారి సౌకర్యం కల్పించాలని అధికారులను ఆదేశించారు. లబ్ధిదారులకు కేటాయించే స్థలాన్ని అతి సుందరంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ డైరెక్టర్ అయూబ్ భాష, ఒకటవ సచివాలయ కన్వీనర్ చాంద్‌బాషా, సచివాలయాల ఇంజినీరింగ్ అసిస్టెంట్లు సరోజ్ బాషా, ప్రణీత్మయి, అలేఖ్య, మహమ్మద్ జియా ఫాజిల్ పాల్గొన్నారు.



జగనన్న కాలనీలో విద్యుత్ సౌకర్యానికి సరఫరా అయిన స్తంభాలు

విద్యుత్ సౌకర్యం ఏర్పాటుకు కృషి

ప్రజాశక్తి-కలకడ

విద్యుత్తు సౌకర్యం ఏర్పాటు కోసం కృషి చేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఎఇ నాగరాజు తెలిపారు. మండలంలోని బాలయ్యగారిపల్లి పంచాయతీ ఎర్రయ్యగారిపల్లి సమీపంలో నిర్మిస్తున్న జగనన్న కాలనీకి విద్యుత్ సౌకర్యం ఏర్పాటు కోసం విద్యుత్ స్తంభాలు సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. సుమారు పది విద్యుత్ స్తంభాలను సరఫరా చేశామని మిగిలిన వాటిని కూడా వీలైనంత త్వరగా సరఫరా చేసి జగనన్న కాలనీకి విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేస్తామన్నారు. కాలనీ నిర్మాణాల కోసం బోరుకు విద్యుత్తు ఏర్పాటు చేసి నీటి సౌకర్యం కల్పించేందుకు చర్యలు చేపట్టినట్లు ఆయన తెలిపారు.



పెట్రోల్ బంకును ప్రారంభిస్తున్న జడ్‌పి ఛైర్మన్ అమర్‌నాథ్‌రెడ్డి

వీరబల్లిలో పెట్రోల్ బంకు ప్రారంభం

ప్రజాశక్తి-వీరబల్లి

మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటుచేసిన జివిఆర్ ఇండియన్ ఆయిల్ పెట్రోల్ ఫిల్లింగ్ స్టేషన్‌ను శనివారం జిల్లా పరిషత్ ఛైర్మన్ ఆకేపాటి అమర్ నాథ్‌రెడ్డి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సతీమణి పెద్దిరెడ్డి స్వర్ణలత, మాజీ ఎంపిపి విజయభాస్కర్ రెడ్డి, మురళీమోహన్‌రెడ్డి, వైసిపి నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాణ్యమైన పెట్రోల్, డీజిల్‌ను వినియోగదారులకు అందించాలని నిర్వాహకులకు వారు సూచించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు గాలివీటి విజయభాస్కర్‌రెడ్డి, మురళీమోహన్‌రెడ్డి, తాహశీల్దార్ తులశమ్మ, ఎంపిడిఒ మధుసూదన్ రెడ్డి, డాక్టర్ వినయ్ బాబు, విద్యుత్ శాఖ ఎఇ శ్యాం ప్రసాద్, సర్పంచులు నేటి ఆంజనేయులు, నాగిరెడ్డి, జిల్లా బిసి విభాగం అధ్యక్షులు మోడెం నాగభూషణం, వంగిమళ్ళ మధుసూదన్‌రెడ్డి, సింగల్ విండో అధ్యక్షుడు కల్లూరి రామ్మోహన్‌రెడ్డి, శ్రీరాముల రెడ్డి, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

బాలికల ఫిర్యాదుపై స్పందన

ప్రజాశక్తి-గాలివీడు

మండల కేంద్రమైన గాలివీడులోని బాలికల ఉన్నత పాఠశాలలో ఎనిమిదవ తరగతి చదువుతున్న విద్యార్థులు పాఠశాల ఆవరణం అపరిశుభ్రత నిండి ఉందని పంచాయతీ కార్యదర్శి సురేష్‌కుమార్‌కు వినతి పత్రం సమర్పించారు. ఆయన స్పందించి పారిశుధ్య కార్మికులను పాఠశాలకు పంపించి పాఠశాలలో పేరుక పోయిన చెత్తను తొలగింపజేశారు. పాఠశాలలో ఉన్న సమస్యను పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించిన విద్యార్థులు దివ్య, నాగేశ్వరి, విజయ, హారిక, తనుజ పలువురు అభినందించారు.

భూ రీసర్వేపై గ్రామసభ

ప్రజాశక్తి-కలకడ

భూములకు సంబంధించి రీసర్వే నిర్వహిస్తున్న సందర్భంగా గ్రామ సభను నిర్వహించినట్లు తహశీల్దారు రాము తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలోని దేవలపల్లి పంచాయతీలో జరుగుతున్న భూముల రీ సర్వేలో రైతులకు సంబంధించిన భూముల వివరాలు, సర్వేలో సరిహద్దులు, తదితర అంశాలపై రైతులకు నివృత్తి చేసినట్లు తెలిపారు. సుమారు 72 మంది రైతులకు 9(2) నోటీసులను జారీ చేశామన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ మస్తాన్ కమలాకర్, విఆర్ఒలు, విఆర్ఎలు, రైతులు పాల్గొన్నారు.

గణితశాస్త్ర ఉపాధ్యాయుడి ఔదార్యం

ప్రజాశక్తి-కలికిరి

పేద విద్యార్థుల అభివృద్దే లక్ష్యంగా పనిచేస్తూ తన ఔదార్యాన్ని చాటుకున్నాడు కలికిరికి చెందిన గణితశాస్త్ర ఉపాధ్యాయుడు ప్రకాష్. పట్టణంలోని ఇందిరమ్మ కాలనీ జడ్‌పి హైస్కూల్లో గణిత శాస్త్ర ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నారు. సాయంత్రం వేళ పక్కనే బిసి వసతి గృహంలోని పేద విద్యార్థులకు ఉచితంగా గణితాన్ని బోధిస్తూ విద్యార్థులను చైతన్యవంతులను చేస్తున్నారు. తన సొంత ఖర్చుతో విద్యార్థులకు అవసరమైన పెన్నులు, పుస్తకాలు, తినుబండారాలు ఉచితంగా అందిస్తూ వారికి చదువుపై మక్కువ పెంచుతున్నారు. హాస్టల్ విద్యార్థులకు ఉచితంగా గణితాన్ని బోధించడం పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు, వార్డెన్ శంకరయ్యలు అభినందనలు తెలిపారు.

ప్రతి విద్యార్థీ ఉన్నత స్థాయికి ఎదగాలి

ప్రజాశక్తి-పెద్దమండ్యం

ప్రతి విద్యారి ఉన్నత విద్యను అభ్యసించి ఉన్నత స్థాయికి ఎదగాలని మోడల్ కాలేజీ ప్రిన్సిపల్ రామాంజనేయులు నాయక్ పేర్కొన్నారు. శనివారం మోడల్‌స్కూల్, కాలేజీలో పదవతరగతి, ఇంటర్ రెండవ సంవత్సరం విద్యార్థులులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిలుగా తహశీల్దార్ నిర్మాలదేవి, డిటిఒ బాగభూషన్, ఎస్ఐ వెంకటేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా తహశీల్దార్ నిర్మాలదేవి మాట్లాడుతూ విద్య ఉంటే సామాజికంగా, ఆర్థికంగా అన్ని రంగాల్లో రాణించవచ్చుని తెలిపారు. క్రమ శిక్షణతో చదువుకొని ఉన్నతమైన స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ అనిల్ కుమార్ రెడ్డి ,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధిగ్రస్తులను ఆదుకుందాం : డిఎంహెచ్ఒ

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

క్షయ వ్యాధిగ్రస్తులను దూరం పెట్టకుండా ఆదుకుందామని డిఎంహెచ్ఒ కొండయ్య పేర్కొన్నారు. శనివారం దేవళంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో టిబి వ్యాధిగ్రస్తులను గుర్తించి వారికి పోషక ఆహారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా దేవలంపల్లి పిహెచ్‌సి పరిధిలో 9 మంది క్షయ వ్యాధిగ్రస్తులను గుర్తించి వారికి ప్రతి నెల పోషకాలు, మందులు ఉచితంగా అందజేసేందుకు వారిని దత్తకు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో ఎఎన్ఎంలు పర్యటించి సీజనల్ వ్యాధుల పైన అవగాహన కల్పిస్తూ టైఫాయిడ్, మలేరియా, డెంగ్యూ వంటి జ్వరాలు ప్రబలకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. ముఖ్యంగా క్షయ వ్యాధిగ్రస్తులకు ప్రతినెల మంచి పౌష్టికాహారం కచ్చితంగా అందించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ రియాజ్ బేగ్, ఎంపిహెచ్ఒ దేవదానం, జిఎన్ఎం సుజాత, ఎఎన్ఎంలు సిబ్బంది పాల్గొన్నారు. **మదనపల్లె అర్బన్ :** టిబి రహిత సమాజ స్థాపనే ప్రభుత్వ ధ్యేమని, క్షయ వ్యాధి గ్రస్థులు మందులతో పాటు సమతుల్యతతో కూడిన ఆహారాన్ని తీసుకొంటే వ్యాధి తొందరగా నయమవుతుందని జిల్లా ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ పంజలిదేవి అన్నారు. శనివారం జిల్లా ఆస్పత్రిలో నిర్ధారిత టిబి రోగులకు వారి సమ్మతితో దాతల సహకారంతో పౌష్టిక ఆహార పదార్థాల కిట్‌లను పంపిణీ చేశారు. మందులను సక్రమంగా ఆరు నెలలు పాటు వాడితే నయమవుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా ఆస్పత్రి వైద్యులు, నర్సింగ్ సూపరింటెండెంట్ పాల్గొన్నారు. **వాల్మీకిపురం :** పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తోందని జిల్లా డిసిహెచ్ఎస్ డాక్టర్ చంద్రశేఖర్ అన్నారు. ప్రధానమంత్రి టిబి ముఖ్త భారత్ పోషన్ మిత్ర కార్యక్రమంలో భాగంగా స్థానిక ప్రభుత్వాసుపత్రిలో షాంధాసిని ఫౌండేషన్ సహకారంతో మదనపల్లి ధాత్రి ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్షయ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డిసిహెచ్ఎస్ చంద్రశేఖర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు క్షయ వ్యాధి నివారణకు అనేక కార్యక్రమాలు చేపడుతున్నాయని, దేశవ్యాప్తంగా



టిబి రోగులకు పౌష్టికాహారం అందిస్తున్న డిఎంహెచ్ఒ కొండయ్య

వివిధ రాష్ట్రాలలో పలు స్వచ్ఛంద సంస్థలు కూడా వారి వంతు కృషి చేస్తున్నారన్నారు. మదనపల్లికి చెందిన ధాత్రీ ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ స్వాతి ఆధ్వర్యంలో ప్రతి నెల 50 మంది క్షయ వ్యాధిగ్రస్తులకు ఆరు నెలల పాటు ఉచితంగా పౌష్టికాహారాన్ని అందజేయడం అభినంద నీయమన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఫైరోజా బేగం, డాక్టర్లు లేఖ్య, హర్షిత రెడ్డి, సనా ఆయేషా, టిబి యూనిట్ వైద్య సిబ్బంది నాగిరెడ్డి, మురళి, సిబ్బంది సుధాకర్, భాస్కర, నవీన్, నరేంద్ర, సిహెచ్ఓలు ప్రత్యూష, అశ్విని, అమృత, మౌనిక, గంగరత్న, ఆశావర్కర్లు పాల్గొన్నారు. **రామాపురం :** మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కుమ్మరపల్లె ఆరోగ్య ఉప కేంద్రాన్ని శనివారం డిఎంహెచ్ఒ కొండయ్య తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పిహెచ్‌సిలో రికార్డులు, ఒపి రికార్డులను పరిశీలించారు. అనంతరం కుమ్మరపల్లె ఆరోగ్యఉపకేంద్రాన్ని తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఆయన వెంట మండల వైద్యాధికారులు విజయ్‌కుమార్, వినోద్‌కుమార్, సిహెచ్ఒ ఎలివేజర్ పిహెచ్ఎన్, విజయకుమారి, హెల్త్ సూపర్వైజర్లు, రాఘవేంద్రరాజు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి : జడ్జి



సమావేశంలో మాట్లాడుతున్న నందలూరు జడ్జి లత

ప్రజాశక్తి-పుల్లంపేట

ప్రతి మహిళా ధైర్యంగా ముందడుగు వేస్తే విజయం సొంతమవుతుందని నందలూరు జడ్జి కె.లత తెలిపారు. శనివారం పుల్లంపేట లోని స్థానిక శివాలయం నందు లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా మహిళలకు చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ ప్రతి మహిళా చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల కోసం అనేక చట్టాలను తీసుకువచ్చారని, ఆ చట్టాలను అనుసరించి మహిళలు ధైర్యంగా ముందుకు వెళ్లి తమకు రావలసిన హక్కులను సాధించుకోవాలని ఆమె తెలియజేశారు. ముఖ్యంగా గృహహింసలు, అవమానపరచడం, మహిళలపై దాడులు ఇటీవల కాలంలో ఎక్కువ అవుతున్నాయని, అందుకే చట్టాలపై అవగాహన కలిగి ఉంటే ఎటు వంటి పరిస్థితి నైనా ఎదుర్కొనే అవకాశం మహిళలకు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో రూరల్ సిఐ పుల్లయ్య, బార్ అధ్యక్షులు నరసింహులు, న్యాయవాదులు షేక్ మహమ్మద్ అలీ, సుబ్బరామయ్య, ఆనంద్ కుమార్, నరసింహులు, తాహసిల్దార్ నరసింహ కుమార్, ఎంపిడిఒ ప్రకాశం, ఎస్ఐ సుబ్బారెడ్డి, ఎంఇఒ రంగనాథయ్య పాల్గొన్నారు. **లక్కిరెడ్డిపల్లి :** మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని మండల లీగల్ అథారిటీ ఛైర్మన్ న్యాయవాది చెన్న కృష్ణయ్య పేర్కొన్నారు. లక్కిరెడ్డిపల్లి సివిల్ జడ్జి ఫయాజ్ వినిష ఆదేశాల మేరకు శనివారం ఏపీ మోడల్ స్కూల్లో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. వివాహం చేసుకొని గొడవ అయిన వెంటనే విడాకుల వరకు వెళ్లడం మంచిది కాదన్నారు. బాల్య వివాహాలు చేసుకున్న చట్టరీత్యా నేరమన్నారు. ప్రతి ఒక్కరూ బాగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించి సమాజంలో మంచి పేరు సంపాదించుకోవాలని సూచించారు. కష్టపడి చదివితే మంచి భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ రేఖా, ఉపాధ్యాయులు సూర్యుడు నాయక్ విద్యార్థులు పాల్గొన్నారు. **రైల్వేకోడూరు :** మహిళలు అన్ని రంగాలలో రాణించాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ ఎ.శ్రీలక్ష్మి పేర్కొన్నారు. మండలంలోని కె.బుడుగుంటపల్లె ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మహిళా దినోత్సవంలో భాగంగా లీగల్ అవేర్నెస్ వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ మహిళలకు సంబందించిన చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అన్ని విషయాలలో పురుషులతో సమానంగా రాణించాలన్నారు. విశ్రాంత ప్రధానోపాధ్యాయులు వై.స్వర్ణ లత మాట్లాడుతూ ఇంటిలో మహిళ విద్యావంతురాలైతే ఆ కుటుంబమంతా ఆరోగ్యంగా ఆనందంగా ఉంటుందని తెలిపారు. పరుగు పందెంలో పిటి.ఉష, అంతరిక్షంలో కల్పనాచ్లావా, కరణం మల్లీశ్వరి, ఇందిరాగాంధీ వంటి మహిళలు ఎలా ఉన్నత స్థాయికి చేరుకున్నరో మనం కూడా అదే స్థాయికి ఎదిగితే బాగుంటుందన్నారు. విశ్రాంత ప్రధానోపాధ్యాయులు స్వర్ణలతాదేవిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కో-ఆర్డినేటర్ డాక్టర్ రమేష్, అధ్యాపకులు, ఉమా మహేశ్వరి, శ్రావణి, శివయ్య, దాసరి మోషే, పెంచలయ్య, డాక్టర్ శ్రీనివాసులు, టి.శ్రీనివాసులు, డి.వెంకటేశ్వర్లు, సురేంద్ర, సురేష్, విద్యార్థులు పాల్గొన్నారు.



స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న డిఎస్‌పి కె.కేశప్ప

అసాంఘిక కార్యకలాపాలపై నిఘా : డిఎస్‌పి

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

మండలంలో అసాంఘిక కార్యకలాపాలపై నిఘా ఉంచాలని మదనపల్లి డిఎస్‌పి కె.కేశప్ప తెలిపారు. శనివారం నిమ్మనపల్లి పోలీస్ స్టేషన్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో జరుగుతున్న నాటుసారా తయారీ, కర్ణాటక మద్యం విక్రయం, అక్రమ ఇసుక రవాణా, గంజాయి అమ్మకం వంటి అసాంఘిక కార్యకలాపాలపై పోలీసులు గట్టి నిఘా ఉంచాలని తెలిపారు. ఈనెల 13న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తుగా నేర చరిత్ర కలిగిన వారిని బైండోవర్ చేసుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద బందోబస్తును పటిష్టం చేయాలన్నారు. అనంతరం స్థానిక పోలీస్ స్టేషన్ లోని పలు రికార్డులను పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న కేసులను పరిష్కరించటానికి కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ ఫాతిమా, స్థానిక పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

డ్రైవర్‌కు సన్మానం

నిమ్మనపల్లి : రోడ్డు ప్రమాద ఘటనలో ఓ వ్యక్తి ప్రాణాలు కాపాడిన డ్రైవర్ ఎం.వెంకటరమణను మదనపల్లి డిఎస్‌పి కె.కేశప్ప ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ ఈనెల 1న రాచవేటివారి పల్లి వద్ద ద్విచక్ర వాహనం, మహేంద్ర లగేజీ వాహనం ఢీకొనడం జరిగిందన్నారు. ఈ ప్రమాదంలో రాచవేటివారిపల్లెకు చెందిన కె.సురేంద్రరెడ్డి తీవ్రంగా గాయపడ్డాడు. మదనపల్లికు చెందిన డ్రైవర్ ఎం.వెంకటరమణ సకాలంలో స్పందించి 108 వాహనానికి ఫోన్ చేయగా, వాహనం అందుబాటులో లేదని తెలియటంతో, డ్రైవర్ తన వాహనాన్ని సంఘటనా స్థలంలోనే వదిలి, ప్రయివేట్ వాహనంలో గాయపడ్డ వ్యక్తిని మదనపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, చికిత్స అందించారు. డ్రైవర్‌ను డిఎస్‌పి స్థానిక పోలీస్ స్టేషన్‌లో దుశ్శాలువాతో ఘనంగా సన్మానించి, రూ.5వేలు ప్రోత్సాహక నగదుగా అందించారు.



బృందావనం కేంద్రాన్ని పరిశీలిస్తున్న డిపిఒ ధనలక్ష్మి

సమయపాలన పాటించకుంటే చర్యలు : డిపిఒ

ప్రజాశక్తి-కురబలకోట

సచివాలయ సిబ్బంది సమయ పాలన పాటించకుంటే కఠిన చర్యలు తప్పవని డిపిఒ ధనలక్ష్మి హెచ్చరించారు. శనివారం మండలంలోని ముదివేడు సచివాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సచివాలయంలో ప్రజలకు అన్ని సేవలు అందించాలని పేర్కొన్నారు. గ్రామ వాలంటీర్లు బయోమెట్రిక్ అటెండెన్స్ వేయాలని అన్నారు. వేసవిలో నీటి సమస్యలు తలెత్తకుండా చూడాలని తెలిపారు. అనంతరం ముదివేడు బృందావనం కేంద్రాన్ని సందర్శించారు. చెత్త నుండి సంపద కేంద్రంలో అధిక మొత్తంలో ఎరువు తయారు చేయవలెనని అన్నారు. ఎరువును కేజీ ఐదు రూపాయలు చొప్పున గ్రామంలోని రైతులకు విక్రయించాలని అన్నారు. కేంద్రాన్ని పూర్తిస్థాయిలో కేంద్రాన్ని వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించి గర్భిణులకు, బాలింతలకు, పిల్లలకు అందిస్తున్న పౌష్టికాహారాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ముదివేడు సర్పంచ్ షెహనాజ్ బేగం, ఎంపిడిఒ దిలీప్ కుమార్, ఇఒపిఆర్‌డి, సిడిపిఒ సుజాత, సూపర్వైజర్ సుగుణ, పంచాయతీ కార్యదర్శి రామప్ప సిబ్బంది పాల్గొన్నారు.

లోకేష్ పాదయాత్రను జయప్రదం చేద్దాం

కలికిరి: యువగళం పేరుతో నారా లోకేష్ చేస్తున్న పాదయాత్రలో పీలేరు నియోజకవర్గం ఎస్‌సి సెల్ అధ్యక్షుడు అగస్తీశ్వర కోరారు. నియోజకవర్గంలో ప్రారంభమయ్యే పాదయాత్రకు టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి సూచనల మేరకు నియోజకవర్గంలోని అన్ని మండలాల నుండి ప్రజలు అత్యధికంగా పీలేరుకు చేరుకుని పాదయాత్రలో భాగస్వామ్యం కావాలని కోరారు. ముఖ్యంగా యువకులు, మహిళలు అధిక సంఖ్యలో హాజరయ్యేలా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి పైన ఉందన్నారు. యువగలం పేరుతో వైసిపి ప్రభుత్వం పై పోరాటం సాగిస్తున్న లోకేష్‌కు బాసటగా నిలవాలని కోరారు. **కురబలకోట :** నారా లోకేష్ పాదయాత్రను జయప్రదం చేయాలని ఆ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి తెట్టు రెడ్డిశేఖర్ కోరారు. మండలంలోని చింతమాకులపల్లె గ్రామ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి చిత్తూరు జిల్లాలో చివరగా తంబళ్లపల్లె నియోజకవర్గంలో జరుగుతుందన్నారు. ఈనెల 11న తంబళ్లపల్లెలో ప్రారంభమై 17న ములకలచెరువులో జరిగే బహిరంగ సమావేశంతో జిల్లాలో దిగ్విజయంగా పూర్తవుతుందని చెప్పారు. కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు గంగిరెడ్డి, ఉపాధ్యక్షుడు జీవరత్నం, మాజీ ఎంపిపి తిమ్మరాయుడు, గ్రామ కమిటీ అధ్యక్షులు గంగిరెడ్డి, ఉపాధ్యక్షులు జీవరత్నం, కొళ్ల శివారెడ్డి, గుడే శ్రీనివాసులు, ఉదయ్ కుమార్, శ్రీనివాసులు రెడ్డి, శివారెడ్డి, సదాశివ, చిన్నరెడ్డెప్ప, మాజీ ఎంపిటిసి పాల్గొన్నారు.

రేపు వ్యాసరచన పోటీలు

పులివెందుల టౌన్ : అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సోమవారం స్థానిక ప్రభుత్వ బాలికల కళాశాల ఆవరణలో వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు స్నేహిత అమృతహస్తం సేవా సమితి అధ్యక్షులు రాజు ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమాన్ని కడప నెహ్రూ యువ కేంద్రం, సంయుక్త ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులను అందజేస్తామన్నారు.

ఘనంగా జాతీయ లైన్‌మెన్ దినోత్సవం

పుల్లంపేట: మండల పరిధిలోని అసిస్టెంట్ ఇంజినీర్ కార్యాలయంలో శనివారం జాతీయ లైన్‌మెన్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రిటైర్డ్ ఫోర్ మెన్ రామసుబ్బారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఫీల్డ్ లోనూ లైన్ మెన్లు కీలక పాత్ర పోషించాలని ప్రతిచోట చాలా జాగ్రత్తగా ఉండి ప్రజల అవసరాలు తీర్చవలనని, ముఖ్యంగా భద్రత లైన్‌మెన్ విషయంలో చాలా ముఖ్యమైన ఘట్టమని తెలిపారు. జెఇ కుమార్ మాట్లాడుతూ లైన్‌మెన్లు చాలా జాగ్రత్తగా వ్యవహరించాలని, ప్రతి చిన్న విద్యుత్ సమస్యను జాగ్రత్తగా పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఎఇ కుమార్, లైన్ మెన్లు సుబ్బయ్య, సుధాకర్ రెడ్డి, ఆరిఫ్, శ్రీనివాసులు, సుబ్రహ్మణ్యం చంద్రమోహన్, సురేంద్ర, రామసుబ్బారెడ్డిని ఘనంగా సత్కరించారు.



రామసుబ్బారెడ్డిని సత్కరిస్తున్న లైన్‌మెన్లు



ఇమ్యునైజేషన్ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న మలేరియా అధికారి

తల్లి, బిడ్డకు రోగ నిరోధక టీకాలు

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

మండల పరిధిలో జరుగుతున్న రోగనిరోధక టీకాల కార్యక్రమాన్ని జిల్లా మలేరియా అధికారి బి.వేణుగోపాల్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోగనిరోధక టీకాల కార్యక్రమం పకడ్బందీగా నిర్వహించాలని అన్నారు. ప్రతి తల్లి, బిడ్డకు రోగ నిరోధక టీకాలను తప్పనిసరిగా వేయాలని సిబ్బందికి సూచించారు. మండల వ్యాప్తంగా ఆరు గ్రామాలలో రొటీన్ ఇమ్మ్యునైజేషన్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారని, రాచవేటివారి పల్లి పంచాయతీలోని గొల్లపల్లిలో, రెడ్డివారిపల్లి పంచాయతీలోని పిట్టావాండ్లపల్లిలో జరుగుతున్న కార్యక్రమాలను తనిఖీ చేసినట్లు తెలిపారు. ప్రతి గర్భిణికి, ప్రతి బిడ్డకు ఏ వయసులో ఇవ్వాల్సిన టీకాలను ఆ వయసులోనే క్రమం తప్పకుండా ఇవ్వాలన్నారు. టీకాల ద్వారా వారిలో రోగనిరోధక శక్తిని పెంపొందించి, ఆరోగ్యంగా జీవించేలా చర్యలు తీసుకోవాలన్నారు. టీకాలను ఇచ్చే ముందు రోజు ఆ తల్లి, బిడ్డకు సమాచారాన్ని తెలియజేయాలని వైద్య సిబ్బందికి సూచించారు. వైద్యుల అవసరమైన వైద్య సామగ్రి కలిగిన కిట్టును వెంట తీసుకోవాలని సూచించారు. ప్రతి బుధవారం ఆరోగ్య ఉపకేంద్రంలో ప్రతి శనివారం క్షేత్రస్థాయిలో రోగనిరోధక టీకాల కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో డివిజనల్ సబ్ యూనిట్ ఆఫీసర్ గఫూర్, ఎంపిహెచ్ఇఒ రామచంద్ర, సిహెచ్ఒ మల్లిక , వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ సమీపంలో చెలరేగిన మంటలు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

పట్టణ శివారు ప్రాంతంలోని పాఠశాల సమీపంలో ఉన్న గుట్టకు గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో మంటలు చెలరేగి ఆదర్శ పాఠశాల సమీపం వరకు వ్యాపించాయి. పాఠశాలలోని విద్యార్థులు, అధ్యాపకులు భయాందోళనలకు గురయ్యారు. ఈ విషయాన్ని పాఠశాల ప్రిన్సిపల్, స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఎఎస్ఐ బొజ్జనాయక్ సిబ్బందితో వెళ్లి స్థానికంగా ఉన్న ప్రజల సహకారంతో పాఠశాల నుంచి నీళ్లు తెప్పించి మంటలు వ్యాపించకుండా అదుపు చేశారు. ఈ సందర్భంగా ఎఎస్ఐ మాట్లాడుతూ సకాలంలో తమ సిబ్బందితో కలిసి పాఠశాల వద్దకు చేరుకొని గుట్టలోని మంటలను అదుపు చేయడంతో ఎటువంటి ప్రమాదం జరలేదని తెలిపారు.



వాహనాలు తనిఖీ చేస్తున్న సిఐ సాదిక్ అలీ

ముమ్మరంగా వాహనాల తనిఖీ

ప్రజాశక్తి-ములకలచెరువు

ఉపాధ్యాయులు, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా ఎస్‌పి హర్షవర్ధన్‌రాజు ఆదేశాలతో అంతర్రాష్ట, అంతర్ జిల్లా చెక్ పోస్టులు ఏర్పాటు చేసి నిఘాను పెంచినట్లు సిఐ సాదిక్ ఆలీ తెలిపారు. శనివారం మండలంలోని మార్గానపల్లి, ఆంకాలమడుగు అంతర్రాష్ట చెక్‌పోస్టులను పరిశీలించారు. కర్ణాటక నుంచి వచ్చే వాహనాలను తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ములకలచెరువు సర్కిల్ పరిధిలోని నాలుగు మండలాల్లో ఆక్రమాలను చెక్ పెట్టేలా చెక్‌పోస్టులను ఏర్పాటు చేశామన్నారు. అనుమానం వచ్చిన వాహనాలను తనిఖీలు నిర్వహించాలని ఎస్ఎస్ఐలకు ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు. ఆక్రమ మద్యం రవాణా, నాటుసారా తయారీని అరికట్టడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఎన్నికల సందర్భంగా సర్కిల్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని సిఐ హెచ్చరించారు.

జంగం కులస్తుల సమస్యలు పరిష్కరించండి

ప్రజాశక్తి-కలికిరి

జంగం కులస్తుల సమస్యలు పరిష్కరించి, వారు నివసించే కాలనీలలో కనీస మౌలిక సదుపాయాలను కల్పించాలని ప్రభుత్వ సలహాదారుడు సజ్జల రామకృష్ణారెడ్డికి జంగం కులస్తుల రాష్ట్ర అధ్యక్షుడు మద్దిరాల మల్లికార్జున కోరారు. శనివారం అమరావతి లోని సజ్జల రామకృష్ణారెడ్డి కార్యాలయంలో ఆయన తమ కులస్తులతో కలిసి తమ సమస్యలను వినతిపత్రం సమర్పించారు. రాష్ట్రంలో జంగం కులస్తులకు కనీస వసతులు కానీ మౌలిక సదుపాయాలు లేవని స్మశాన వాటికలు, ప్రహరీ గోడలు ఏర్పాటు చేయాలని, కమ్యూనిటీ భవనాలు నిర్మించాలని, శివైక్యం పొందిన వారి కనడానిక అయ్యే ఖర్చులు ప్రభుత్వం అందించాలని కోరారు. మహిళలకు చేతి వృత్తుల యందు శిక్షణ ఇచ్చి ఆర్థికంగా అభివృద్ధి పరచుటకు సహకరించాలని, చిన్న తరహా, కుటీర పరిశ్రమలు ఏర్పాటుకు కృషిచేసి స్థాపించాలని కోరారు. జంగం కులస్తులకు ప్రత్యేకంగా కార్పొరేషన్ ఏర్పాటు చేసి వారికి విద్య, వైద్య, రాజకీయ రంగాలలో ప్రాధాన్యత కల్పించాలన్నారు. జంగం మహేశ్వరుల సమస్యలపై సానుకూలంగా స్పందించి సమస్యలను పరిష్కారం కోసం కార్యాచరణ రూపొందించి అమలు చేస్తాయాలని కోరారు. స్పందించిన సజ్జల జంగం కులస్తుల సమస్యలపై అధ్యయనం చేసి పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారని వారు పేర్కొన్నారు.

క్రైం కార్నర్

ఇద్దరు నాటుసారా నిందితులు అరెస్టు

ప్రజాశక్తి -కలకడ

నాటు సారా అమ్మడానికి తరలిస్తున్న ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. ఎంసిసి టీం ఇన్‌ఛార్జి స్థానిక ఎంపిడిఒ సిహెచ్.నారాయణ, ఎస్ఐ తిప్పేస్వామి సిబ్బంది సహాయంతో దాడులు నిర్వహించారు. మండలంలోని కోన గ్రామానికి చెందిన పచ్చిపాల కృష్ణమనాయుడు, వాల్మీకిపురం మండలం మేకలవారిపల్లికి చెందిన చిరంజీవిలు కలసి 40 లీటర్ల నాటు సారాను అమ్మడానికి తరలిస్తున్నట్లు గుర్తించిన టీం సిబ్బంది వారిని పట్టుకుని, వారి వద్ద నుంచి 40 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అనంతరం వారిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ దాడులలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా డిగ్రీ కళాశాలలో అగ్ని ప్రమాదం

ప్రజాశక్తి-కలికిరి

స్థానిక మహిళా డిగ్రీ కళాశాలలో అగ్ని ప్రమాదం సంభవించింది. కళాశాల విద్యార్థులు, సిబ్బంది కృషి తో తృటిలో ప్రమాదం తప్పింది. శనివారం ఎస్‌డబ్ల్యూఆర్ ప్రభుత్వ బాలికల డిగ్రీ కళాశాల, కలికిరి కళాశాలలో మంటలు చెలరేగటంతో విద్యార్థులు, అధ్యాపకులు మంటలను ఆర్పడానికి ప్రయత్నించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎస్.గులాబ్ జాన్ ఫైర్‌స్టేషన్ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వచ్చి మంటలను అదుపు చేశారు. విపత్తు అధికారి శ్యామ్ కళాశాల ఆవరణలో విద్యార్థులు చేసిన సాహసాన్ని అభినందించారు. ఇంట, బయట మంటలు సంభవించినపుడు ఎలా ఇతరులను రక్షించాలి, మనకు మనం ఎలా రక్షించుకోవాలనే పలు విషయాలను విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రేఖ, కె.మాధవి, సి.ఎస్.ఉదయ, జి. మాధవి, జి.శైలజ అధ్యాపకులు పాల్గొన్నారు.